# వారసుడు

### ఉషారాణి భాటియా

కౌంటరు ముందు నుంచున్న లలిత ముఖం ఒక్కసారి వెలవెల బోయింది బిల్లు చెల్లించి వచ్చి. భర్త పలకరించినా. పరాకుగా కదలనేలేదు.

చాలా రోజుల తరువాత, ఇవాళ బజారుకని బైట కదిలింది లలిత పెట్టెలో మూలుగుతున్న గులాబీరంగు వెంకటగిరిచీరా, పట్టురవికా తొడుక్కుంది తలలో మల్లెలూ, చేతినిండా గాజులూ, కాళ్ళకి ఘల్లుమంటూ మట్టెలూ — లలితని వీధిలో అందరూ కళ్ళు యింతింత చేసుకుని చూశారు

సూపరుబజారు యిదే మొదటిసారి చూడటమేమో, ఒక్కో దుకాణం ముందూ, వింతగా చూస్తూ నిలబడి పోయింది లలిత. ఆమె చేతులు పెట్టిందల్లా 'కావాలా?' అని అడుగుతూనే వున్నాడు భర్త రాజారావు ఎందుకో ఈ ప్లాస్టిక్ బొక్కెన చూడగానే, కొనాలని ముచ్చటపడింది లలిత మనసు అంత ఎత్తు లేకుండా, వెడల్పుగా, బట్టలవీ వుతుక్కునేందుకు వీలుగా, ఉందనిపించింది...ఓ నీలంరంగు బొక్కెన చేతిలోకి తీసుకుంది.

ఇంతలోకి వచ్చారు, గడ గడ మాట్లాడుతూ ఓ అరవ దంపతులు ఆ యిల్లాలి ఓ చేతిలో చంటివాడు, రెండో చెయ్యి లాగుతూ ఓ గుంటడు, భర్త చంకలో ఓ అమ్మాయి, వున్నారు

"ఏమేవ్! ఈ బొక్కెన చూశావా? పిల్లలకి స్నానం చేయించేదే! బాగుంది కదూ?'' భర్త యిల్లాలిని తట్టాడు. ఆ స్త్రీ ఒంగి, బొక్కెనకి తగిలించిన ఖరీదుచీటీ చూసింది.

"అమ్మో! ఇరవై ఎనిమిది రూపాయలే? మనం ఎక్కడ కొనగలం? కలిగినవాళ్ళ పిల్లలకి తగును,'' అంటూ పెదిమలు విరిచింది. ఈలోగా, ఆమె చంకలోని పిల్లాడు, దాంట్లోకి దూకబోయాడు ఆ దంపతులు లలితని ఓరగా చూస్తూ, ముందుకి కదిలిపోయారు

అంతే! లలిత గుండెల్లో ఏదో పోటుగా అనిపించింది తల బరువు ఎక్కింది కళ్లు చెమ్మగిల్లాయి

"ఏమండీ! నా కీ బొక్కెన వొద్దు. మామూలు పెద్దబక్కెట్టు తీసుకుందాము ఇది పిల్లలకి నీళ్లు పోసేదిట!''


లలిత గొంతు గద్గదికం కావటం

ఎందుకో గ్రహించాడు భర్త "నీకు ఏమైనా మతి పోయిందా? పిచ్చిదానా! పోనీ నేను కూర్చుని స్నానం చేస్తానులే,'' అంటూ లాలనగా లలిత భుజంమీద చెయ్యి వేశాడు

ఆ రోజు యింకేమీ చూడలేక పోయింది లలిత. ఉత్సాహం నశించటం అటుంచి, రుమాలుతో కళ్ళు తుడుచు కుంటూనేవుంది

కారు స్టార్టు చేస్తూ, భార్యని ఓదార్పుగా చూశాడు రాజారావు. అతని కిది మొదటి అనుభవం కాదు ఇప్పటికి ఏడు సంవత్సరాలుగా, అడపా తడపా లలిత యిలా బైటపడుతూనేవుంది - ఎవరో ముసలమ్మ అడిగిందని ఓ మాటూ, అత్తగారు అన్నారని ఓ మాటూ భర్త మనసు కదుపుతూనే వుంది.

అంతేకాదు; సినిమా చూస్తూ ఓ చంటి పాపాయి కేరుమన్నా, షికారు కెళ్ళుతున్నప్పుడు ఓ పెరాంబ్యులేటరు ఎదురయినా, పత్రికలో ఓ బోసినోటి పాప బొమ్మ కనుపించినా - లలిత మనసు



చివుకుచివుకు మంటూనే వుండేది ఆమెని చూసి రాజారావు మహా యిబ్బంది పడిపోయేవాడు

"వీళ్ళ కమలకి పురుడు వచ్చింది వాళ్ళ కోమలికి నెల తప్పింది పక్కింటి లక్ష్మికి గాజులు తొడిగిస్తున్నారు,'' అని తల్లి జాబితా తెరిచినప్పుడు, రాజారావు లౌక్యంగా భార్యని అటునుంచి తీసుకెళ్ళి పోయేవాడు లలితని ఎంత సరదాగా వుంచాలో, అంతా, శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు కానీ యిలాటి 'ప్రమాదాలు' తప్పటం లేదు

* * *

పురుషుడు గనుక, అతను జీవితాన్ని వాస్తవికంగా ఎదుర్కొ గలిగాడు. తమకి సంతానం కలగదనే విషయం ధైర్యంగా వినగలిగాడు ఆ తరువాత అపజయంగా భావించి, కుమిలిపోతూ మనసుని పాడుచేసుకోలేదు

కానీ లలిత అలాకాదు ఏడేళ్ళక్రితం, డాక్టరు ఆ విషయం చెబుతున్నప్పుడు, స్త్రీ సహజమైన మాతృవాంఛ పెల్లుబికి, భోరున ఏడిచింది ఆ తరువాత, భర్తని వేరే వివాహం చేసుకోమని పోరు పెట్టింది కాశీ వెళ్ళిపోవటానికి ప్రయాణము కట్టింది. ఆత్మహత్య చేసుకుంటానని వాపోయింది

కానీ ఇవన్నీ రాజారావు చాలా ఓర్పుగా సర్దుకువచ్చాడు. అతనికి లలితంటే అంతప్రాణం మరి! అందుకే, ఎన్నడూ దేవుడూ, గుడీ ఎరగని రాజారావు, లలితకోసమైనా సంతానం యివ్వమని, గుళ్ళో దణ్ణం పెట్టుకున్నాడు

కానీ అది జరిగే చాలారోజు లయింది

* * *

ఆ రోజు రాత్రే దిళ్ళ మధ్యన మోచేయి ఆనిస్తూ, లలిత అడిగింది "ఏమండీ! పోనీ మనమూ ఓ పాపని పెంచుకుంటే?"

"ఊఁ! అలాగే,' అంటూ రాజారావు ఆమెని దగ్గిరకి తీసుకోబోయాడు.

"ఊఁ! ఆఁ! అంటే వీలులేదు వెంటనే కావాలి మొన్నను మీ అమ్మ కూడా అన్నారు," లలిత ఆవేశంతో మంచంమీద లేచికూర్చుంది

కానీ రాజారావుకి తెలుసు, దాంట్లో ఎన్ని చిక్కు ముడు లున్నాయో! "చూడు! పిల్లని పెంచుకోవటమంటే, బజారుకెళ్ళి ఓ బొమ్మని కొనటం అనుకుంటున్నావా? దానికి బోలెడంత ఆలోచన కావాలి ఏర్పాట్లు చెయ్యాలి,'' అన్నాడు సముదాయింపుగా.

''నాకు తెలుసు, మీకు యిష్టంలేదు'' లలిత నిరాశగా ముఖం పెట్టింది

"నన్ను అలా అపార్థం చేసుకోకు ఈ కొరత నిన్నెంతగా బాధిస్తూందో, నన్నూ అంతే. నీకు యిష్టమైంది, ఏది యిష్టం కాలేదు నాకు ఇంతవరకూ?'' అంటూ లలిత చెయ్యి నొక్కాడు

* * *

అతను మాట యిచ్చింది తడవుగా, లలిత ఆ విషయంతప్ప మరోటి ఆలోచించలేకపోయింది రోజూ, రాజారావు ఆఫీసునుంచి యింటికి రాగానే, బోలెడంత సమాచారం సేకరించివుంచేది గుంటూరులో భద్రయ్యగారికి ఏడుగురు పిల్లలు ఒక పిల్లదాన్ని దత్తతకి యిస్తారుట. లలిత పిన్నిగారి ఆడబడుచు కొడుకు ఒకడున్నాడు సిద్ధంగా రాజారావు మేనమామ కూతురుకూడా తన నాలుగోకొడుకుని దత్తత యిచ్చేందుకు అభ్యంతరం లేదంటున్నది విజయవాడలోకూడా ఓ బంధువుల అబ్బాయి వున్నాడు — ఇలా అనేకమంది తనకంతమంది చుట్టాలు ఉన్నట్టుకూడా మునుపెన్నడూ ఎరగడు రాజారావు.

ఆ సమాచారం విని వూరుకోవటం కాదు సలహా చెప్పవలసివచ్చేసరికి, అతని ఓర్పు నశించేది అంతా కుటుంబ రాజకీయాలు చూడగా, లలిత తరపు బంధువులూ, తన తరపు బంధువులూ పోటీ పడుతున్న భావం కలిగింది అతనికి.

కొడుకు దత్తత తలపెట్టాడని విని, ఓ మాటు రాజారావు తల్లి, వూర్నించి దిగింది. "ఇదిగో రాజూ! ఈ తంతు జరగవలసివుంటే, బంధువర్గంలోంచే దత్తత చెయ్యాలిసుమా! అదీ మీనాన్నగారి వైపునుంచే లేకుంటే ఆయన ఆత్మకి శాంతి దూరం చేసినవాడవవుతావు," అని బెదిరించింది రాజారావు మౌనంగా నేలకేసి చూస్తూ వూరుకున్నాడు

ఇక శలవురోజు వచ్చిందా, ఆ దంపతులకి నెమ్మది లేకుండా పోయింది ఎవరో ఒకరు, ముఖ్యంగా చుట్టాలు, హాజరయేవారు. అసలు దత్తత ఎలా జరగాలో, ఎవర్ని చేసుకోవాలో, కుటుంబ సాంప్రదాయం ఎంతముఖ్యమో మును పెంతమంది అలా చేసుకున్నారో అనర్గళంగా చెప్పుకుపోయేవారు. లలిత అవన్నీ శ్రద్ధగా వినేది కానీ ఆ తరువాత, రాజారావుతో ఆ విషయాలు సంప్రదించబోతే, అతను కస్సుమంటూ లేచేవాడు

"నా కిప్పటికే తల పగిలిపోతూంది రెండు ఆస్ప్రోలు మింగాను," అని విసుక్కునేవాడు

లలితకి విషయం ఫలానా అని బోధపడకపోయినా, మనసు గందరగోళంగానూ, కలతగానూ వుండేది

* * *

ఓ రోజు సాయంత్రం యిద్దరూ బీచికి వెళ్లారు దీపాలు పెట్టారు కింద యిసుకలో నడుం వాలిస్తే, హాయిగా వుంది. రాజారావు కింద పడుకుని, పైన నక్షత్రాలకేసి చూస్తున్నాడు దూరంగా నీళ్ళదగ్గిర ఆడుకుంటున్న పిల్లల్ని కన్నార్పకుండా చూస్తోంది లలిత "లలితా! పోనీ మనం ఆఫ్రికా వెళ్ళి, ఓ నీగ్రో పిల్లవాణ్ణి పెంచుకుంటే?"

అంటూ భార్య కొంగు పట్టుకు లాగాడు రాజారావు

లలిత ఉలిక్కిపడింది "ఉష్! మీకు అంతా ఆటలుగావుంది," అంటూ మూతి ముడుచుకుంది కళ్లు కోపంగా అయాయి

"ఏం? అందులో తప్పేం? పోనీ మన లచ్చి కొడుకుని పెంచుకుందాం పోనీ ఏదయినా అనాథశరణాలయానికి వెళ్ళి తెచ్చుకుందాం," అన్నాడు, యింకా పైకి చూస్తూనే

"అయ్యో! మీ కేమయినా మతి పోయిందా? అమాంబాపతువాళ్ళనీ దత్తతా?" అంటూ లెంపలు వేసుకుంది లలిత

"బ్రాహ్మలే కావాలంటావు? అందులోనూ నియోగులు! సాంప్రదాయం గల కుటుంబంలో? ఏమో, నా భావాలు వేరుగా వున్నాయి ఈ దత్తత ఏదో అయేవరకూ వస్తున్న కష్టాలు అటుంచి, తీరా రేపు ఈ తతంగం పూర్తయాక, సగంమంది చుట్టాలు నాకు శతృవులయేట్లున్నారు"

ఈ మాటు లలిత ఏమీ సమాధానం చెప్పలేదు ఎందుకంటే, అతని ఆఖరి మాటలో లలితకీ కొంత నిజం కనుపించింది

"అల్లరి చిల్లరి మాటలు అటుంచి, అసలు ఏం చేద్దామో చెప్పండి?" అంటూ దగ్గిరకి జరిగింది

"దత్తత వద్దూ అని నేను అనటం లేదు చేసుకుందాము కానీ బంధువులలో మటుకు వొద్దు. వాళ్లు మనసుంచి ఎదురు చూసేది ఎక్కువగా వుంటుంది. తరువాత మనస్పర్ధలూ తప్పవు," అని ఆగాడు రాజారావు

"సరే! తరువాత?" అన్నది లలిత అంగీకారసూచకంగా

"నిజం అడిగితే, కులం, సాంప్రదాయం యివన్నీ నాకు నమ్మకంలేదు. ఓ మంచి కుటుంబంలో దొంగ పుట్టటం లేదా? ఓదొంగకి బుద్ధిమంతుడు కలగటం లేదా? అంతా మనవూహలోనే వుంది నా వుద్దేశం ఏమంటే, ఎవరికీ చెప్పకుండా, యిద్దరం చల్లగా ఓ అనాధశరణాలయానికి వెళ్ళి పాపని తెచ్చుకుందాం జీవితంలో ఓ మంచికార్యం చేసినట్లూ వుంటుంది, మనసుకి శాంతీ లభిస్తుంది" రాజారావు ఉత్సాహంగా భార్యవైపు చూచాడు.

"ఇంకానయం! శరణాలయానికివెళ్ళి మన కులం కానివాడిని తెచ్చి, మీ కుటుంబానికి వారసుణ్ణి చెయ్యమంటారా? ఈపాపం నేను చెయ్యలేను మీ అమ్మగారు నన్ను వీధిలోకి తోసేస్తారు .. తరతరాలుగా మీ వంశం నన్ను ఆడిపోస్తుంది," లలిత భయంతో చెవులు మూసుకుంది, ఆ శాపనార్ధా లేవో అప్పుడే వినపడినట్లు

"నాకు అభ్యంతరం లేకుంటే మధ్యన నీ కెందుకు? మొన్ననే..." పెళ్ళానికి దగ్గిరగా జరిగాడు రాజారావు




"అటువైపు వెళుతూ చూశానులే! పిల్లలు ఎంత ముద్దొస్తున్నారనీ! అదేదో పాపలసంస్థట – పేరు జ్ఞాపకంలేదు "

లలితహృదయం కోపంతో ముడుచుకుంది "మీకు తెలియదేమో! దిక్కులేనివాళ్ళూ, చెడిపోయినవాళ్ళూ కని పారేసిన పిల్లలు వాళ్ళు రామ! రామ! నాకు ఒద్దు బాబూ!" అన్నది లలిత గొంతు తగ్గించి రహస్యంగా

"అవన్నీ మన కెందుకే? ఆ పసివాళ్లు ఈ విషయాలన్నీ ముఖానికి బోర్డు కట్టుకుని, మనింటికి వస్తారా ఏమన్నానా? అసలు వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు శరణాలయంవాళ్ళు మనకి చెప్పరు కూడాను "

లలిత మౌనంగా వింటోంది ఇద్దరూ లేచి, కారువైపు నడిచారు

ఆరాత్రి రాజారావు లలితకి ఇంకా చెబుతూనే వున్నాడు, "అంతా మనం పెంచటంలో వుంది, కల్పించే వాతావరణంలో వుంది ఎవరిపాప అయితేనేం? ఎక్కడ పుడితేనేం? చదువు, సంస్కారం యిచ్చి ప్రయోజకుల్ని చేయటం మన చేతుల్లో వుంది అబ్రాహ్మణ పిల్లవాడైతే మాంసమే తింటాడు, బ్రాహ్మడి కొడుకయితే, వేదమే చదువుతాడు – యివన్నీ అర్థంలేని మాటలు అందరిలాగా కళ్ళు మూసుకుని చేసేబదులు, కొంత మన బుర్రా, ఆలోచనా ఉపయోగిస్తే తప్పులేదు "

రాజారావు కంఠశోషంతా పూర్తయాక, చివరికి లలిత నిస్సారంగా యిలా అంది, "అయితే! మా అమ్మని అడుగుతాను, ఏమంటుందోను"

రాజారావుకి తాటిప్రమాణాన కోపం వచ్చింది "అదే బుద్ధితక్కువపని! ఒకరిసలహా ఎందుకు నీకు? అసలు ఎవరికన్నా తెలియటం దేనికి? మావాళ్ళడిగితే నీతరఫుబంధువనీ, నీవాళ్ళడిగితే నాతరఫుబంధువనీ చెబుదాము"

ఆ మాట విని, అంత ఆలోచన మధ్యా నవ్వింది లలిత

*　*　*

"దయచేసి ఈ ఫారము పూర్తి చేయండి ఇందులో మీకుటుంబ వివరాలూ, జీతం అన్నీ యివ్వాలి దీనికింద భార్యాభర్తలిరువురూ సంతకం చెయ్యాలి"

రాజారావు, జేబులో పెన్ను తీసి, కాయితం అందుకున్నాడు పక్కనే కూర్చున్న లలిత, ఆ పరిసరాల్ని కుతూహలంతో చూస్తూన్నది

ఆఫీసుగది దాటాక, పెద్దహాలు, నీలంరంగు యూనిఫారము బట్టలతో, పిల్లలు కిటకిట లాడుతున్నారు ఆరు నెలల ఓ చంటివాణ్ణి, ఆయా ఎత్తుకువచ్చి, లలితకి చూపించింది కళ్ళనీ, మూతినీ చిన్నవి చేస్తూ, వేళ్ళాడుతున్న బుగ్గలూ, బొట్లాల్లాటి చేతులూ, నున్నని గుండూ, ఆపసివాడు లలితకేసి చూస్తూ, కొంటెగా నవ్వాడు

"ఓ సంవత్సరంపాటు ఈ పిల్లవాణ్ణి అప్పు డప్పుడూ మాకు చూపిస్తూ వుండాలి మీదగ్గిర ఎంత అలవాటయిందీ, పిల్లవాడి పోషణ ఎలావున్నదీ, సంస్థకి తృప్తిగా వుంటేనే, దత్తతకి యివ్వటం జరుగుతుంది," అన్నాడు, పక్కనే నిలబడ్డ సంస్థ కార్యదర్శి

రాజారావు, భుజాలు ఎగురవేస్తూ భార్యకేసి చూసి నవ్వాడు.

ఆ మరునాడే, కుటుంబంతో సహా కొద్దికెనాలు వెళ్ళిపోయాడు, రెండు నెలల శలవుమీద

చాలాకాలం తరువాత — అదే యిల్లు, అదే తోట, సాయసంధ్యవేళ

ఇల్లంతా దీపాలతో చాలా వెలుగ్గా వుంది వాకిట్లో మామిడాకులు వేళ్ళాడుతున్నాయి లోపలగదిలో పెద్ద తివాసీ పరచివుంది ఓపక్కగా, బల్లమీద తినుబండారాలు అమర్చివున్నాయి పైన రంగురిబ్బన్లు వేళ్ళాడుతున్నాయి

రాజారావు కుర్చీలు ఓపక్కగా సర్దుతున్నాడు అతని తల నెరిసివుంది. కంటికి అద్దాలు వచ్చాయి కొద్దిగా ఒళ్ళు వచ్చిందికూడా నోట్లో పైపు వెలుగుతోంది వయసుతెచ్చే గాంభీర్యం, బాధ్యతా అతని రూపంలో వ్యక్తమవుతున్నాయి. రాజారావు కాస్సేపు నౌఖర్లమీద కేకలు వేస్తున్నాడు, కాస్సేపు లలితని పిలుస్తున్నాడు అతని కంఠం విని, యింట్లో అంతా, ఆదరాబాదరా పరిగెడుతున్నారు

"సుబ్బు ఏడండీ? ఇంకా రాలేదు! అదే పోయిన పోక! అందరూ వచ్చే వేళయింది." లలిత ఆదుర్దాగా అతని పక్కకు వచ్చి నిలబడింది.

"వస్తాడులే! ఇంకా ఆరు కాలేదుగా? ఏదీ ఆ యాష్ట్రే ఇలా పట్టుకురా" పురమాయించాడు అతను.

"హల్లో మిస్టర్! రాజారావ్! కంగ్రాచ్యులేషన్స్! ఇంతకీ నీ కొడుకుని ఐ ఏ ఎస్. అనిపించావ్!"

వెనుకనుంచి స్నేహితుడు పిలవడంతో, తిరిగి కరచాలనం చేశాడు రాజారావ్

"ఇంతకీ నీ అదృష్టం ఒదినా! రేపు నీకొడుకు కలెక్టరయితే, హాయిగా కాలుమీద కాలేసుకుని కూర్చుంటావు." ఆడబిడ్డ, లలితని కావలించుకున్నంత పనీ చేసింది వంటింట్లో

ఇంతలో, బిల బిల మంటూ పాతిక మంది పైగా అతిధులు రానేవచ్చారు అంతా రాజారావు ప్రాణ స్నేహితులు, సహావుద్యోగులు సుబ్బారావు పుట్టిన పండగా, పరీక్షాఫలితాలు వచ్చేరోజూ ఒకటే అయాయి ఆ శుక్రవారం.

అందరికళ్ళూ ఆతురతతో అబ్బాయి కోసం ఎదురుచూస్తున్నాయి.

ఆరు దాటింది కానీ అత నింకా రాలేదు లలితకి ముచ్చెమటలు పోస్తున్నాయి రాజారావు కేదో యిబ్బందిగా వుంది. వసారాలోకీ, లోపలికీ తెగ పచార్లు చేస్తున్నాడు.

ఇంతలో బైట అలికిడి అయింది తండ్రిఅంత ఒడ్డూ, పొడవూ, చామన ఛాయ రంగయినా ఆకర్షణీయమైన ముఖం, నీలం పంట్లామూ తెల్లని టెరిలిన్ షర్టూ_ సుబ్బారావు చప్పుడు కాకుండా, లోపలికి వచ్చాడు. అతన్ని చూసిందే తడవుగా, అందరూ కరచాలనం చేసేందుకు ముందుకు వచ్చారు. ఉక్కిరి బిక్కిరి అయాడు కుర్రాడు తల్లిదాపుకి వెళ్ళి, చాటుగా చేతికి ఏదో అందించాడు

"ఏమిట్రా అది? ఇంత ఆలస్యం అయిందేం?" అడిగాడు రాజారావు.

సుబ్బు తల్లివంక చూశాడు ఆమె తల పక్కకి తిప్పుకుంది.

"మాట్లాడవేం?" నాయనమ్మ లాలనగా అడిగింది

లలిత నవ్వుతూ, సిగ్గుపడుతూ, అత్తగారిదగ్గరకి వెళ్ళింది చెయ్యి చాపి చూపించింది

"నాతండ్రీ! గుడికి వెళ్ళావుట్రా! చెప్పావుకావేం? అంతా మా రాజుగాడి పోలికే! ఆచదువూ! ఆభక్తీ! ఎక్కడికి పోతాయి పోలికలు!"

నాయనమ్మ, సుబ్బారావు తలని ఒంచి, నుదుటిమీద ముద్దెట్టుకుంది

రాజారావు కళ్ళు చటుక్కున, లలిత కోసం వెతికాయి. ఆమె చూపులూ అతన్ని కలిశాయి.